క్లుప్తంగా

గృహ నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి

మంగళగిరి: నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జెల్లి విల్సన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఆత్మకూరు గ్రామంలో నిరుపేదల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. 18వ తేదీన అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో స్థలాల మంజూరుకు అర్జీలు సమర్పిస్తామన్నారు. నాయకులు చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్‌బాబు, కాబోతు ఈశ్వరరావు పాల్గొన్నారు.

నూతక్కి పశువుల ఆసుపత్రిలో స్వచ్ఛభారత్

మంగళగిరి: పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, తద్వారా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండొచ్చని కేఎల్‌యూ మెకానికల్ ఇంజినీరింగ్ డీన్ టి.విజయ్‌కుమార్ తెలిపారు. నగర పరిధిలోని నూతక్కి పశువుల ఆసుపత్రిలో శుక్రవారం కేఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించి, శుభ్రపరచారు.అనంతరం ఇంటింటికి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి, పశువైద్యశాఖ డాక్టర్ కె.ఛాయాదేవి, సహాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి: ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ద్వారకా నగర్‌లో ఉన్న ఎస్ఎల్ఎం చైతన్య స్కూలు ఆవరణలో ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, గృహ సముదాయం, నిరుద్యోగ భృతి కల్పించాలని కోరారు. విద్యా వలంటీర్లను కొనసాగించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఫెడరేషన్ నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా చాల్కా మోరిస్ జమ్రాన్, షేక్ జరీన్ శశికళ, సెక్రటరీ కె.లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీగా బి.మల్లేశ్వరరావు, ట్రెజరర్‌గా వీసం భువనేశ్వరి, గౌరవ సలహాదారులుగా పి.హేమలత, శృంగారపాటి దాసు ఎన్నికయ్యారు.

సోషల్ మీడియా ప్రభావంపై అవగాహన

తాడేపల్లిరూరల్ : సోషల్ మీడియా పిల్లల జీవన శైలిపై తీవ్రంగా ప్రభావం చూపిస్తోందని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో–ఆర్డినేటర్ ఎస్.జాకబ్ రాజు అన్నారు. శుక్రవారం వెంకటపాలెంలోని చిగురు బాలల ఆశ్రమంలో విద్యార్థులకు బాలలపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథి జాకబ్ రాజు మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా 50 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు ఉపన్యాసం, చిత్రలేఖనం, వ్యాసరచన, పాటలు, నాటిక ప్రదర్శన పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నవజీవన్ బాల భవన్ ఫాదర్ మిల్కియెర్ మొదటి బహుమతి అభిలాష్, రెండవ బహుమతి రత్నబిందు, మూడవ బహుమతి వినీతకు ప్రదానం చేశారు. చిగురు ఇన్‌చార్జి జ్యోత్స్న పాల్గొన్నారు.

ఫాదర్ పూదోట ఇన్నయ్య జయంతి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయం ప్రాంగణంలో శుక్రవారం ఫాదర్ పూదోట ఇన్నయ్య 90వ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లపాడు విక్టోరియా ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ బెల్లంకొండ ఇన్నయ్య, డొక్కా మాణిక్యవరప్రసాద్ పాల్గొన్నారు. ఇన్నయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫాదర్ బెల్లంకొండ ఇన్నయ్య మాట్లాడుతూ ఫిరంగిపురంలో ఫాదర్‌గా పూదోట ఇన్నయ్య పనిచేసినప్పుడు గ్రామానికి తాగునీటి కొరత తీర్చేందుకు మంచినీటి కోనేరు ఏర్పాటు చేసి గ్రామాభివృద్ధికి కృషిచేశారన్నారు. కార్యక్రమంలో బత్తుల కోటేశ్వరరావు, చిట్టా బాపూజీరెడ్డి, లక్ష్మణరెడ్డి, వెంకటరెడ్డిలు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు వైద్యులు పాల్గొని, వైద్య సేవలందిస్తారని తెలిపారు. దుగ్గిరాల మండల పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ముగిసిన శిక్షణ కార్యక్రమం

మేడికొండూరు: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, పంచాయితీ రాజ్ శాఖ ఆదేశాలతో మండల అధికారులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ కార్యక్రమం రెండవ రోజు మండల అభివృద్ధి అధికారిని తోట చందన ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యంగా గ్రామపంచాయతీ అభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు జారీ చేశారు. శిక్షణలో మండల పరిషత్ అధ్యక్షురాలు స్వప్న, ఈఓపీఆర్‌డీ పూర్ణ శంకర్‌రావు, మండలంలోని ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

శోభాయమానంగా కార్తీక పౌర్ణమి

ఫిరంగిపురం: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల శివాలయాల్లో భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. ఫిరంగిపురంలోని కాళహస్తీశ్వర ఆలయంలో ఉసిరి చెట్లు, మారేడు చెట్లు వద్ద దీపాలు వెలిగించి ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. వేణుగోపాల స్వామి ఆలయంలోని పురాతన రావిచెట్టు వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. రామాలయం వద్ద నగరేశ్వరుడి ఆలయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలు దీపాలు వెలిగించారు. సాయినాథ ఆలయంలో దీపాలు వెలిగించి స్వామిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

వేమవరంలోని కోటిలింగాల ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించారు. ముఖ మండపం వద్ద ఏర్పాటు చేసిన సువర్ణ లింగానికి భక్తులు పాలతో అభిషేకాలు చేశారు. సాయంత్రం లక్ష ఒత్తులతో కోటిలింగాల చుట్టూ దీపాలు వెలిగించారు. జ్వాలాతోరణాన్ని ఏర్పాటు చేసి భక్తులు దానికిందుగా శివ నామస్మరణ చేస్తూ నడిచి వచ్చారు. అదేవిధంగా నుదురుపాడు కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, వేములూరిపాడులోని జలపాలేశ్వర స్వామి ఆలయంలో, తక్కెళ్లపాడులోని శివాలయాల్లో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

శివాలయంలో కార్తిక పౌర్ణమి పూజలు

మంగళగిరి: పట్టణంలో వేంచేసి వున్న శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం)లో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందడి నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించగా ఆలయ ఆవరణ దీపాల కాంతులతో దేదీప్యమానంగా వెలుగులు విరాజిల్లింది. అనంతరం మహిళలు భక్తులు కార్తీక జ్వాలా తోరణం వెలిగించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కైలాసగిరి క్షేత్రంలో అభిషేకం

హరి నామస్మరణతో మార్మోగిన శైవాలయాలు

మేడికొండూరు: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని పేరేచర్లలోని కైలాసగిరి క్షేత్రంలో ఘనంగా పూజలు నిర్వహించారు. డోకిపర్రు, జంగంగుంట్లపాలెం, విశదల, సిరిపురం, పాలడుగు, కొర్రపాడు, గుండ్లపాలెం గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త రఘు స్వామి ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పర్వదినం సంధర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు.



కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నారా లోకేష్

కోటి దీపోత్సవం.. ప్రారంభించిన మంత్రి లోకేష్

మంగళగిరి: పట్టణంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ కల్యాణ వేదిక ఆవరణలో శుక్రవారం కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని మణి ద్వీపం ట్రస్ట్ ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొని దీపోత్సవాన్ని ప్రారంభించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. పానకాల స్వామి దేవస్థానం నుంచి బయలుదేరి గండాలయస్వామి కొండకు చేరుకున్న భక్తులు జ్వాలా దీపం వెలిగించారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ,ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఏ రామకోటిరెడ్డి, ఏపీ ఎండీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఐఓటీ టెక్ ఎక్స్‌పో

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ (ఐఓటీ) టెక్ ఎక్స్‌పోను శుక్రవారం నిర్వహించారు. యూనివర్శిటీ బీఈఎస్–2 విభాగాధిపతి డాక్టర్ పి.ఎస్.వి. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడంతో పాటు వారికి సైన్స్ పట్ల ప్రాథమికంగా అవగాహన కల్పించడం కోసం ఈ ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులు ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ (ఐఓటి) ఎలక్ట్రానిక్ వాహనాలను, పరికరాలకు పూరకల్పన చేసి వాటికి సరికొత్త ఆలోచనలను జోడించి ఎక్స్‌పోలో ప్రదర్శించారని వివరించారు. ఈ ప్రదర్శనలో మొత్తం 198 బృందాలుగా విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ప్రతిభ కనబరిచిన బృందాలను ఎంపిక చేసి బహుమతులు అందజేశామన్నారు. యూనివర్శిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ. జగదీష్, ఎఫ్ఈడీ ప్రిన్సిపల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. సుమన్, డైరెక్టర్ హనుమంతరావు అభినందించారు.



పరిశీలిస్తున్న డాక్టర్ కె.రాజశేఖరరావు

విపత్తుల నిర్వహణపై అవగాహన

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో ప్రకృతి వైపరీత్యాలు, మానవ తప్పిదాల వల్ల కలిగే విపత్తులు, నియంత్రణకు సరైన స్పందనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.శరత్‌కుమార్ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించిన 17 సుస్థిర లక్ష్యాల్లో 11వ దైన సుస్థిరమైన నగరాలు, సంఘాలను సమీకరించడం అనే లక్ష్యాన్ని వేగంగా సాధించడానికి సరైన విపత్తు నిర్వహణ ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. అభివృద్ధి చెందిన సాంకేతిక వ్యవస్థను ఉపయోగించి ప్రకృతి విపత్తులను ఎంతో ముందుగానే పసిగట్టవచ్చన్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ముఖ్య వక్తగా వాతావరణ శాస్త్ర అధ్యయన విభాగ ఆచార్యులు డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ పంచభూతాత్మకమైన ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. బీఏ (ఐఏఎస్) విభాగ అధిపతి డాక్టర్ బి.శివనాగయ్య మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ పరీక్షలకు శిక్షణ పొందుతున్న విద్యార్థులకు విపత్తు నిర్వహణ విజ్ఞానం అత్యంత ఆవశ్యకమన్నారు.



వేదికపై డాక్టర్ శరత్ కుమార్, డాక్టర్ శివనాగయ్య

కార్తీక పౌర్ణమి గురుపూజోత్సవం

మంగళగిరి పట్టణంలోని సాయి నగర్‌లో శుక్రవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా దుంపల సోములు ఆధ్వర్యంలో శివరామ దీక్షితుల గురువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరపూజ, కలశ పూజ, గురుపూజ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పూర్ణానంద ముద్రబోయిన వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, రామ్మోహన్‌రావు గురుబోధ సందేశం అందజేశారు. ప్రతినిధులు పందేటి సాంబశివరావు, జూట్రు ఏడుకొండలు, సగళం ప్రసాద్, ముద్రబోయిన సుబ్బారావు, రెడ్డి సుబ్బారావు, దుంపల నరసింహారావు, తాడిశెట్టి వెంకయ్య, భక్త బృందం ప్రతినిధులు పాల్గొన్నారు.



గురు పూజోత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు

మహిళల ఆర్థిక స్వావలంబనతో సమాజ ప్రగతి

మైనార్టీ ఆఫైర్స్ ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షరీఫ్

మంగళగిరి: మహిళల ఆర్థిక స్వావలంబన సమాజ ప్రగతికి కీలకమని ప్రభుత్వ మైనార్టీ అఫైర్స్ సలహాదారు మహ్మద్ షరీఫ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నిడమర్రు రోడ్డులో కల మదర్‌షా అయిషా సిద్దిఖాలో హునర్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ ఈ విధమైన శిక్షణ కార్యక్రమాలు మహిళలకు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే మార్గాలుగా నిలుస్తాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆలీంబాషా, డిప్యూటీ కమిషనర్ శకుంతల, అన్వరి ఇస్లామిక్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహ్మద్ షరీఫ్

తెలుగుజాతి గర్వించదగ్గ మహా నటుడు కృష్ణ

తాడేపల్లిరూరల్ : తెలుగుజాతి గర్వించదగ్గ మహానటుడు, పద్మభూషణ్ సూపర్‌స్టార్ కృష్ణ అని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. శుక్రవారం దుగ్గిరాల జెండా చెట్టు సెంటర్ వద్ద సూపర్‌స్టార్ కృష్ణ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కృష్ణ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ తెలుగు సినీ చిత్ర రంగంలో కృష్ణ ధైర్య సాహసాలకు ప్రతీక అని, పరిశ్రమకు మొట్ట మొదటి సినిమా స్కోప్, కలర్, 70 ఎంఎం స్టీరియో సిస్టమ్ తదితర నూతన టెక్నాలజీలు ఎన్నో పరిచయం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ జాన్ సైదా, షేక్ సలీమ్, ఖాదర్ బేగ్, షేక్ ఖుద్దూస్, షేక్‌సమిఉల్లా, షేక్ సాదిక్, బాజీ, పొట్టస్వామి శ్యామ్ ప్రసాద్, కాకా వెంకటేశ్వర్లు, బులుసుపాటి ఎల్లేశ్వరరావు, మునిపల్లి కుమార్, ధూపం కోటేశ్వరరావు, నారాయణ మూర్తి పాల్గొన్నారు.



కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షేక్ సుభాని

రైతుల సమస్యలకు సత్వర పరిష్కారం

సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్

తాడికొండ: రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే వేదికగా నిలుస్తుందని ఏపీ సీఆర్డీయే అదనపు కమిషనర్ జి సూర్యసాయి ప్రవీణ్ చంద్ అన్నారు. శుక్రవారం తుళ్లూరు సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ప్రజల వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లిష్టతరమైన సమస్యలను అర్జీ అందిన రోజు పరిష్కరించేలా అన్ని విభాగాల సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నామన్నారు. పెద్ద సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి 15 రోజుల్లో పరిష్కారిస్తామన్నారు. గ్రీవెన్స్ ప్రారంభించినప్పటి నుంచి రైతుల నుంచి 740 సమస్యలు రాగా 576 సత్వరమే అక్కడికక్కడే పరిష్కరించగా మిగిలిన 164 సమస్యలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వర్ణమేరి, బి.సాయి శ్రీనివాస్ నాయక్, జి.భీమారావు, కేఎస్ భాగ్యరేఖ, డి.హుస్సేన్ సాహెబ్, ఏజీ చిన్ని కృష్ణ, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో లోపాలపై ఏపీడీతో విచారణ

తాడికొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మొక్కల పెంపకంలో జరిగిన అవకతవకలు, లోపాలపై ఏపీడీతో విచారణ చేయించి తిరిగి మొక్కలు నాటించడం లేదా రికవరీ చేయడం చేయాలని డ్వామా పీడీ శంకర్ సూచించారు. తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం తుళ్ళూరు తాడికొండ మండలాలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ నివేదికను వెల్లడించారు. ఈ సందర్భంగా తాడికొండ, ఫణిదరం, పొన్నెకల్లు, మోతడక పలు గ్రామాల్లో మొక్కల పెంపకానికి సంబంధించి లోపాలను గుర్తించారని వాటిపై ఏపీడీతో విచారణ చేయించి మొక్కలను నాటించడం లేదా రికవరీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పనిదినాలకు సంబంధించి వ్యత్యాసాలు ఉన్న వారి వద్దనుంచి రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. తాడికొండ మండలం 2023–24 ఏడాదికి సంబంధించి 1049 పనులకు గాను కూలీలకు, మెటీరియల్ కాంపోనెంట్‌కు కలిపి మొత్తం రూ.8,89,21,578 నగదు చెల్లించినట్లు తెలిపారు. తుళ్ళూరు మండలానికి సంబంధించి 388 పనులకు గాను రూ.2,64,61,905 నగదు చెల్లింపులు జరిగినట్లు సోషల్ ఆడిట్ నివేదికలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శివన్నారాయణ, ఏపీవోలు జయకుమార్, కిరణ్మయి ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు సిబ్బంది పాల్గొన్నారు.



ఆడిట్ వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌పీలు, సిబ్బంది

గ్రామాల్లో ఎన్‌సీడీసీడీ సర్వే

ఫిరంగిపురం: మండలంలోని పలుగ్రామాల్లో ఎన్‌సీడీసీడీ సర్వే ప్రారంభించినట్లు ఫిరంగిపురం, నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యాధికారులు శుక్రవారం తెలిపారు. ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి ఎత్తు, బరువు చూసి వారికి బీపీ, షుగర్, ఆర్బీసీ, క్యాన్సర్ పరీక్షలు చేసి వాటిని యాప్‌లో నమోదు చేస్తున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

మంగళగిరి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండారాలని రిజిస్టర్ ఆఫ్ పబ్లికేషన్స్ నాగరాజు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో పట్టణంలోని శివాలయం పక్కన ఉన్న మంగళగిరి శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయురాలు ఎస్.ఆదిలక్ష్మి విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయుడు డీఎస్ శర్మ, గ్రంథాలయ అధికారి ఆరోగ్యం, సిబ్బంది పాల్గొన్నారు. నగర పరిధిలోని నూతక్కి శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు తిలకించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జొన్నల బ్రహ్మానందరెడ్డి, జె.శివరామిరెడ్డి, లైబ్రేరియన్ ఎస్.నరసింహారావు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని శాఖ గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్ బాష మాట్లాడుతూ పుస్తక ప్రదర్శన, జూనియర్ విభాగంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈ పోటీలకు ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు కె.వైష్ణవి, సీత న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారని చెప్పారు. గ్రంథాలయంలో అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించుకుని విద్యార్థులు జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన కోరారు.

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలీ శాఖ గ్రంథాలయంలో శుక్రవారం వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఫిరంగిపురంలోని పలు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు వైరస్, విషజ్వరాల నివారణ చర్యలు అనే అంశంపై వ్యాసరచన నిర్వహించామని గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్‌బాబు తెలిపారు.

తాడికొండ: పుస్తక పఠనంతో చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించుకోవచ్చని తాడికొండ శాఖ గ్రంథాలయాధికారులు జి శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు చింతల భాస్కరరావు, యెమేశ్వరరావు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. తుళ్ళూరు గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో తుళ్ళూరు గ్రంథాలయాధికారి టి.గిరిధర్ కుమార్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మేడికొండూరు : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి సుధారాణి శుక్రవారం పుస్తక ప్రదర్శన, చిత్రలేఖనం పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. అనంతరం రత్నం పాఠశాల విద్యార్థులతో గ్రంథాలయ వారోత్సవాల అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

మందడం(తాడికొండ): విద్యార్థులు పాఠ్య పుస్తకాలపై సమయం ఎక్కువ కేటాయించాలని వీఐటీ ఏపీ స్కూల్ ఆఫ్ లా డీన్ డాక్టర్ చక్కా బెనర్జీ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వీఐటీ– ఏపీ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మందడం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఇంప్రూవింగ్ రీడింగ్ హ్యాబిట్స్ అమాంగ్ స్కూల్ చిల్డ్రన్ పేరుతో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. విద్యార్థులు పుస్తకాల ద్వారా తమ విద్యా, వృత్తిపరమైన అభివృద్ధికి సహాయపడే నమ్మకమైన సమాచారాన్ని సేకరించేందుకు విశ్రాంతి సమయం కేటాయించాలని సూచించారు. వీఐటీ ఏపీ గ్రంథాలయాధికారి డాక్టర్ వీరాంజనేయులు మాట్లాడుతూ స్వతంత్ర్య పోరాటంలో గ్రంథాలయాల పాత్రను వివరించి గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జాన్సీ, విఐటి– ఏపీ లైబ్రరీ సిబ్బంది సాయి బాబు, డీవీ ప్రసాద్ పాల్గొన్నారు.



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



మాట్లాడుతున్న వీఐటీ ఏపీ స్కూల్ ఆఫ్ లా డీన్ డాక్టర్ చక్కా బెనర్జీ

సిలిండర్ పేలి పూరిల్లు దగ్ధం

కంతేరు(తాడికొండ): సిలిండర్ లీకై మంటలు చెలరేగడంతో పూరిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైన ఘటన మండలంలోని కంతేరు గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దేశమాల కల్యాణమ్మ అనే వృద్ధురాలు శుక్రవారం ఉదయం 8:30 గంటల సమయంలో వంట చేసుకుంటుండగా మంటలు చెలరేగి పూరింటికి అంటుకొని సిలిండర్ పేలడంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు మంటలార్పేందుకు యత్నించినప్పటికీ సిలిండర్ ప్రమాదం కావడంతో ఎవరూ సాహసించలేదు. దీంతో డబ్బు, నగదుతో పాటు ఉన్నదంతా కాలిపోయి వృద్ధురాలు కట్టుబట్టలతో మిగిలింది. దాచుకున్న నగదుతో పాటు సామగ్రి మొత్తం రూ.2 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు అంచనా. రెవెన్యూ సిబ్బంది బాధిత కుటుంబానికి 30 కిలోల బియ్యం, ఆయిల్, కందిపప్పు, పంచదార ప్యాకెట్లను స్థానిక టీడీపీ నాయకుల చేతుల మీదుగా అందజేశారు.

రేపు తాడేపల్లి పట్టణ వైఎస్సార్ సీపీ సమావేశం

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో ఈ నెల 17న ఆదివారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి పట్టణ ముఖ్య నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు తాడేపల్లి పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు గౌడ సంఘం వన సమారాధన

తాడేపల్లిరూరల్ : ఇప్పటం గ్రామంలోని మామిడి తోటలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని గౌడ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధనను ఆదివారం నిర్వహించనున్నట్లు తాడేపల్లి మండల గౌడ సంఘం నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతస్థాయి అధికారులు, గౌడ సంఘం నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. గౌడ సంఘం నాయకులు, ప్రజా ప్రతినిధులు, గౌడ సోదర సోదరీమణులు అందరూ కుటుంబ సభ్యులతో కలసి పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలిపారు.

సమన్వయకర్తకు అభినందనలు

తాడికొండ: వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన వనమాబాల వజ్రబాబును శుక్రవారం మాజీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పలువురు నాయకులు కలిశారు. తాడికొండ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో విజయఢంకా మోగించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయనకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకట శివారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు శృంగారపాటి సందీప్ తదితరులు పాల్గొన్నారు.



వజ్రబాబును అభినందిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి : నగర పరిధిలోని యర్రబాలెం విద్యుత్ కేంద్రం పరిధిలోని అంబటి నగర్, శ్రీరామ్ నగర్, వేప చెట్టు సెంటర్, 60 అడుగుల రోడ్డు, ఆప్కో, సుందరయ్య రోడ్డు, సినిమా హాల్ సెంటర్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

Indian Bank | మంగళగిరి బ్రాంచి. డి.నెం.1-448, సమత హాస్పిటల్ ఎదురు, గౌతంబుద్ధ రోడ్, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఫోన్: 8179026844, ఈ-మెయిల్: mangalagiri@indianbank.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన "APPENDIX - IV-A" [See proviso to rule 6(2) & 8(6)]

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 6(2) & 8(6) నిబంధనలలో పొందుపరిచిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన ... 1) శ్రీ గంజి మురళీ నారాయణ (ఋణగ్రహీత/ తనఖాదారు), 2) శ్రీమతి గంజి లక్ష్మీ పద్మావతి (సహ ఋణగ్రహీత), 3) మెస్సర్స్ షణ్ముఖ్ గోల్డ్ వర్క్స్ (ఋణగ్రహీత), యజమాని : గంజి షణ్ముఖ్, 4) శ్రీ గంజి షణ్ముఖ్ (సంస్థ యజమాని) ... "ఎక్కడ ఏది ఉన్నదో అది", "ఎలా ఉన్నది అలా" మరియు "అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదికన ... ది.09-11-2023 నాటికి బాకీ ఉన్న మొత్తం రూ.45,17,603/- ... మరియు ది.10-11-2023 నుండి ... ఇండియన్ బ్యాంక్, మంగళగిరి బ్రాంచి వారిచే ఇ-వేలం" ద్వారా ది.11-12-2024 న అమ్మకం ... 1) శ్రీ గంజి మురళీ నారాయణ (ఋణగ్రహీత/ తనఖాదారు), డి.నెం.11-441, వార్డ్ నెం.11, ఎన్‌సిసి రోడ్డు, జెండాచెట్టు సెంటర్, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503, 2) శ్రీమతి గంజి లక్ష్మీ పద్మావతి(సహ ఋణగ్రహీత), డి.నెం.11-441, వార్డ్ నెం.11, ఎన్‌సిసి రోడ్డు, జెండాచెట్టు సెంటర్, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503, 3) మెస్సర్స్ షణ్ముఖ్ గోల్డ్ వర్క్స్ (ఋణగ్రహీత), యజమాని : గంజి షణ్ముఖ్, డి.నెం.11-441, వార్డ్ నెం.11, ఎన్‌సిసి రోడ్డు, జెండాచెట్టు సెంటర్, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503, 4) శ్రీ గంజి షణ్ముఖ్ (సంస్థ యజమాని) డి.నెం.11-441, వార్డ్ నెం.11, ఎన్‌సిసి రోడ్డు, జెండాచెట్టు సెంటర్, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522503 ...

స్థిరాస్తుల వివరములు

... గుంటూరు జిల్లా, మంగళగిరి ... అసెస్‌మెంట్ నెం.1023016024, డి.నెం.206, 11వ వార్డు, డోర్ నెం.11-441 లోని 156 చ.గజాల లేదా 130.20 చ.మీ.ల ... తూర్పు : బజారు, దక్షిణం : 4 గజాల బజారు, పడమర : ... ఉత్తరం : ...

రిజర్వు ధర	రూ.40,30,000/- (అక్షరాల నలభై లక్షల ముప్పై వేల రూపాయలు మాత్రమే)	ధరావత్తుసొమ్ము	రూ.4,03,000/- (అక్షరాల నాలుగు లక్షల మూడు వేల రూపాయలు మాత్రమే)
...		బిడ్ పెంపుదల అమౌంట్ : రూ.10,000/-	
ఇ-వేలం (వేలం జరుగుతేది)	ది. 11-12-2024 న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు ఈ వేలం సర్వీస్ ప్రొవైడర్ : https://www.ebkray.in		
ఆస్తి ఐడి నెం.	IDIB7071524330		

... (https://www.ebkray.in)లో నమోదు చేసుకోవాలని ... e-KYC ... ది.10-12-2024న ... e-KYC ...

సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్

ప్రదేశం : మంగళగిరి, తేది : 13-11-2024